క్లుప్తంగా

నష్టపరిహారం చెల్లించాలి

దుమ్ముగూడెం: మండలంలో సీతమ్మ ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఒకటికి మూడు వంతులు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీతమ్మ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న పెద్దబండి గ్రామాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రారంభంలో సర్వే చేసిన భూములే కాకుండా అదనంగా మరోసారి సర్వే చేస్తున్నారని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అసలైన లబ్ధిదారుడికి కాకుండా వేరొకరికి పరిహారం దారిమళ్లుతోందని తెలిపారు. సమస్యలను పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి పుల్లయ్య, మండల కమిటీ సభ్యులు వీర్రాజు, కనకరావు, నరసింహారావు, హరిబాబు, సారయ్య, బాబురావు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు వితరణ

భద్రాచలంఅర్బన్: కొన్ని రోజుల నుంచి నడవలేక అనారోగ్యంతో బాధపడుతున్న స్థానికుడు గుమ్మడి రాజుకు పలువురు ఆర్థిక సాయం అందించారు. పద్మావతి డయాగ్నస్టిక్స్ సెంటర్ యాజమాన్యం, రేడియాలజిస్ట్ డాక్టర్ నరసింహారెడ్డి రూ.5వేలు, స్థానిక మదర్ థెరిస్సా కాలేజ్ డైరెక్టర్ తోటమల్ల వెంకటరమణ, ప్రిన్సిపల్ బి.నాగేశ్వరరావులు రూ.5వేలు సాయంగా అందజేశారు.

వసతులు కల్పించండి

బూర్గంపాడు: ముసలిమడుగు గ్రామంలో బస్ షెల్టర్, అంగన్‌వాడీ కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఐటీసీ యాజమాన్యాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సర్పంచ్ కుర్సం వెంకటరమణ కోరారు. బుధవారం ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) చెంగలరావును కలిసి వినతిపత్రం అందించారు. సందెళ్ల రామాపురం గ్రామంలో కూడా బస్‌షెల్టర్, వాటర్ ప్లాంట్, చెరువు సింగారం గ్రామంలోని ఎంపీపీఎస్ స్కూల్‌లో అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక నాయకులు పొడియం నరేందర్ తదితరులున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: బహుజన సమాజ్ పార్టీ బీఎస్పీ మండల నూతన కమిటీని భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు యాసం సిద్ధార్థ పూలే ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కంచర్ల సింహాద్రి, ఉపాధ్యక్షుడిగా సొంది వెంకట్రాజు, మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల నారాయణ, కార్యదర్శి పొడుతూరి రవీంద్ర ప్రసాద్, ట్రెజరర్‌గా కనుకు సాగర్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మండలంలో బహుజన్ సమాజ్ పార్టీని ప్రతి గడపకూ తీసుకెళ్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రకుల పేదలను ఏకం చేస్తామని అన్నారు. అసెంబ్లీ ట్రెజరర్ కొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

తుమ్మలకు వినతి

దమ్మపేట: సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. బుధవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో తుమ్మలను, ఆయన నివాసంలో అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులు తుమ్మలతో మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయినప్పటికీ ఇప్పటివరకు తమకు నష్ట పరిహారం ఇవ్వలేదని, తమకు రావాల్సిన పరిహారం ప్యాకేజీని అందేలా చూడాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తుమ్మల.. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, శ్రీను పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేయాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేసవి దృష్ట్యా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, ఈశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు, విల్సన్ రాజు, రామ్మూర్తి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్వహణపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలోని చర్చి నిర్వహణపై గ్రామస్తులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ దోమల రమేష్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని చర్చిలో ప్రతి రోజూ ఉదయం 4గంటల నుంచి మైక్ ఆన్ చేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చర్చిలోని ఆలారం గంటగంటకు మోగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వెంకటరాజు, అర్జున్, బుజ్జిబాబు, సావిత్రి, సీతారామరాజు, సంగీతరావు, జ్యోతి, రఘు, రాంబాబు, సందీప్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు మోక్షం

- రూ.5కోట్ల నిధులు మంజూరు
- విద్యార్థులకు తప్పనున్న ప్రయాణ తిప్పలు
- త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశం


కొత్త హంగులతో నిర్మాణం కాబోతున్న డిపో ఆవరణలోని బస్టాండ్

మణుగూరుటౌన్: మణుగూరు డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో దాన్ని ఆర్టీసీ సంస్థ డ్రైవర్ల రెస్ట్‌రూంగా వినియోగించుకుంటోంది. ప్రస్తుతం సురక్షా బస్టాండునే అందుబాటులో ఉంచడంతో అక్కడికి మాత్రమే ప్రజలు చేరుకుంటున్నారు. అయితే మణుగూరు డిపోలో పరిధిలో ఉన్న బస్టాండ్ సైతం వినియోగంలోకి తీసుకురావాలని, తద్వారా ఆర్టీసీ సేవలు ప్రజలకు మరింత దగ్గరవుతాయని అనేక సార్లు పట్టణ ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు.. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. డిపో ఆవరణలోని బస్టాండ్‌కు మోక్షం లభించింది.

నిధుల కేటాయింపు..

విప్ రేగా కాంతారావు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులకు కృషి చేయగా.. ఇటీవల ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నిధుల్లో రూ.5కోట్లను మణుగూరు ఆర్టీసీ డిపోలో ఉన్న బస్టాండ్ అభివృద్ధికి కేటాయించారు. త్వరలో పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు విప్ తెలిపారు. ఈ బస్టాండ్ వల్ల సమితిసింగారం, కూనవరం, పీవీకాలనీ, గుట్టమల్లారం పంచాయతీల ప్రజలకు మరింత ప్రయాణ ఇబ్బందులు తొలుగుతాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పాఠశాల కళాశాల, హస్టల్ విద్యార్థులకు ప్రయాణ తిప్పలు తప్పుతాయి. బస్టాండ్‌కు సమీపంలోనే ప్రభుత్వ హస్టళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండటమే ఇందుకు కారణం.

పీవీకాలనీ వాసులకు ఉపయోగకరం



మణుగూరు డిపో పరిధిలోని బస్టాండ్‌ను ఏర్పాటు చేయడం వల్ల పీవీకాలనీలోని సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు ప్రయాణ ఇబ్బందులు తొలుగుతాయి. ప్రస్తుతం సురక్షా బస్టాండ్‌కు వెళ్లడానికి ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కృషితో ఈ బస్టాండ్‌ను పునర్ నిర్మాణం చేయడం సంతోషించాల్సిన విషయం. అందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు.

– కురి రాజేశ్వరరావు, పీవీకాలనీ, మణుగూరు

విద్యార్థుల ఇబ్బందులు తొలుగుతాయి..



ప్రస్తుతం సుదూర గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుకు వచ్చే విద్యార్థులు సురక్షా బస్టాండ్ వద్ద దిగి కళాశాల వద్దకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిపో ఆవరణలో బస్టాండ్ నిర్మాణం జరిగి ప్రతి బస్సు ఇక్కడకు వచ్చే విధంగా చేయడం వల్ల విద్యార్థుల ఇబ్బందులు తొలుగుతాయి. అందు కోసం కృషి చేసిన ఎమ్మెల్యేకు అభినందనలు.

– బి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరు

‘శ్రమ సువిధ’పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శంకర్‌రావు

మణుగూరుటౌన్: శ్రమ సువిధ పోర్టల్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శంకర్‌రావు అన్నారు. బుధవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి ఉద్యోగులకు శ్రమ సువిధ పోర్టల్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. పోర్టల్‌లో కాంట్రాక్టర్ల వివరాలను రిజిష్టర్ చేసే విధానం, దాని ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపుల్ ఎంప్లాయర్స్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. కాంట్రాక్టర్స్ చట్టానికి లోబడి రికార్డులు నిర్వహించాలనే విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం కేపీ యూజీ మైన్ జి.నాగేశ్వరరావు, ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, పీఐ ఎంఎస్‌జీబీసీ శ్రీనివాసచారి, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, డీజీఎం కేసీహెచ్‌పీ సురేష్, డీవైసీఎంఓ మేరీకుమారి, ఎస్ఈ ఒసీస్టోర్స్ కిశోర్, సీనియర్ పర్సనల్ అధికారి రామేశ్వరరావు, మదార్‌సాహెబ్, ఐటీ ప్రోగ్రామర్ సాయిల సురేష్,క్లరికల్ ఉద్యోగులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

‘బీజేపీ విధానాలను ప్రతిఘటిద్దాం’

భద్రాచలంఅర్బన్: బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ భద్రాచలం పట్టణ కౌన్సిల్ కార్యవర్గ సమావేశం పామరాజు తిరుమలరావు అధ్యక్షత జరిగింది. సమావేశంలో రాంప్రసాద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఇంటింటికీ సీపీఐ పేరుతోఈ నెల 14 నుంచి చర్లలో ప్రజాచైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడారు. సమావేశంలో బల్లాయికుమార్, మారెడ్డి శివాజీ ముప్వా రామలక్ష్మి, నరసింహులు, లంకపల్లి విశ్వనాథ్, ఇమామ్ కాసిం, నాయుడు, సత్యానంద్, రామకృష్ణ, మారెడ్డి గణేష్, తిరుపతి, కాపులు గోపి, జక్కం గోపి, గొల్ల గణేష్, సుశీల, నాగమ్మ, గౌతమి, గంగాధర్, మహేష్, త్రిమూర్తులు, లక్ష్మణ్, కృష్ణయ్య, గుంజా బాబు, మధు పాల్గొన్నారు.

దమ్మపేట: జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుంచి మే 14 వరకు యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివకృష్ణ, ధర్మ, శాంతి, జాన్‌బీ, నాగమణి పాల్గొన్నారు.

అధిక వసూళ్లపై చర్యలు


పార్కింగ్ ఫీజులకు సంబంధించిన బోర్డుకు అడ్డును తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంటౌన్: భద్రాచల రాముడి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు వాహనాలు పార్కింగ్ చేసేందుకు అధిక ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాహన పార్కింగ్ ఫీజులను కాంట్రాక్టర్ అధికంగా వసూలు చేస్తున్నాడని ఈ నెల 4న సాక్షి దినపత్రికలో ‘యథేచ్ఛగా పార్కింగ్ దోపిడీ’అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు.. పార్కింగ్ దోపిడీపై విచారణ నిర్వహించారు. మరోసారి పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. వాహన పార్కింగ్ ఫీజులు తెలుపే బోర్డు కనిపించకుండా ఏర్పాటు చేసిన మరో బోర్డును బుధవారం తొలగించారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, దివంగత డిప్యూటీ ప్రధాని, కేంద్ర మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి, దళిత బహుజనుల సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన చేపట్టిన పదవులన్నిటికీ వన్నెతెచ్చిన మహనీయుడన్నారు. – సాక్షి నెట్‌వర్క్


మణుగూరుటౌన్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ రేగా


మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న


పినపాక: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గుమ్మడి గాంధీ


చండ్రుగొండ: జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు


అన్నపురెడ్డిపల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సున్నం లలిత



మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు


అశ్వాపురం: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయంతి కార్యక్రమం..

బ్రోచర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీశ్రీ కళావేదిక సాహితీ సాంస్కృతిక బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఏపీలోని తిరుపతిలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టే లలిత, పద్మావతి, ప్రసాద్, తులసీదాసు, మధులిక, శ్రీనివాసరెడ్డి, నల్లపు దుర్గాప్రసాద్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: పట్టణానికి చెందిన దివ్యాంగ, గ్రూప్–2 అభ్యర్థిని భవానికి హైదరాబాద్‌కు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత శ్రీవియాల్ ఉయ్యూరి చేయూతనందించారు. రూ.15వేలు బండారు చందర్‌రావు ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీసీఆర్ ట్రస్టు నిర్వహకులు కె.బ్రహ్మాచారి, స్వామి, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి..

దుమ్ముగూడెం: అవినీతికి పాల్పడి అక్రమంగా ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘన చేసి గిరిజనేతర్లకి పట్టాలు చేసిన దుమ్ముగూడెం తహసీల్దార్‌పై క్రిమినల్ కేసు వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. బుధవారం మండలంలోని ములకపాడులో ఏఎస్‌పీ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పాండు హేమ సుందర్, జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు సంయుక్తంగా మాట్లాడుతూ.. గిరిజనేతరులకు పట్టాలు చేసిన అధికారిని సస్పెండ్ చేయడంపై కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గతంలోకూడా పలువురు తహసీల్దార్‌లు ఈ రకంగా పట్టాలు మంజూరు చేశారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు తుర్రం వెంకటేశ్వర్లు, వెంకటేష్, కురసం మహేష్, అల్లేశ్వరావు, కనితి రామకృష్ణ,రాజకుమార్, కొమరం సమ్మయ్య, శీను, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు సీపీఆర్‌పై అవగాహన

మణుగూరురూరల్: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశాడేని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో గృహ సందర్శన చేసి గర్భిణులను గుర్తించి మూడు నెలల్లో వారి వివరాలను నమోదు చేయాలన్నారు. గర్భిణులకు ఎంసీపీ కార్డులు అందించి నిర్ణీత సమయానికి అనుగుణంగా టీడీ వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. ప్రతి నెలా గర్భిణులు విధిగా ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. గర్భిణులకు రక్తశాతం పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు.

అలాగే వారికి ప్రభుత్వ పథకాలైన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు. అనంతరం సిపిఆర్ విధానంపై డాక్టర్ శివకుమార్ ఆశాలకు, ఏఎన్ఎంలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు


గిరిజనుడికి సోలార్ ల్యాంప్‌లు అందిస్తున్న డీఎస్పీ రమణమూర్తి

గుండాల: వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆశ్రయం పొందే అనుమానిత వ్యక్తులకు సహకరించొద్దని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి అన్నారు. మండలంలోని బాటన్న నగర్ గ్రామంలోని గొత్తికోయ కుటుంబాలకు ఆళ్లపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలైన కుటుంబాల అభివృద్ధికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. 25 కుటుంబాలకు సోలార్ ల్యాంప్‌లు అందించి, ఆ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆళ్లపల్లి ఎస్సైలు రతీష్, అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?


మణుగూరుటౌన్: పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

చర్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా బీజేపీ భద్రాచలం నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బిట్రుగుంట క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం చర్లలోని గాంధీ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సంతపురి సురేష్‌కుమార్, మండల అధ్యక్షుడు నక్కా కన్నారావు, నాయకులు సాధం లోకనాథం ముత్తారం రత్తయ్య, పుగాకు పూర్ణచందు, ఆలెం సమ్మయ్య, శ్రీధర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అక్రమ అరెస్ట్ చేశారంటూ నిరసన చేపట్టిన పట్టణ బీజేపీ నాయకులను భద్రాచలం పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, చక్రవర్తి వెంకన్న, ముత్యాల శ్రీనివాస్, బోడ సత్యనారాయణ, ఆవుల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీజేపీకి చెందిన ఆరుగురు నాయకులను స్థానిక పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ అరెస్ట్ నేపథ్యంలో నిరసనలను కట్టడి చేస్తూ స్థానిక ఆ పార్టీ నాయకులు మెట్ట వెంకటేష్, ఎస్‌వీటీ కొండ, బండారు చంద్రశేఖర్, ప్రవీణ్, పుష్కర కుమార్, ఆంజనేయులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

దుమ్ముగూడెం: బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ మండల నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి జెట్టి వెంకటరాజు, మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అపకా శ్రీనివాస్, మండల కిషన్ మోర్చా అధ్యక్షుడు తెల్లం చలపతి, మండల సోషల్ మీడియా కన్వీనర్ కాక రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కురుసం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమవుతున్న స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు పున్నం బిక్షపతి అన్నారు. బుధవారం బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. పార్టీ నాయకులు కుంజ రామకృష్ణ, రమేష్, రవీందర్, నారాయణమూర్తి, నాగశేషు, కిషోర్, ప్రభాకర్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

గుండాల: బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి సంజయ్‌పై పోలీసులు పెట్టిన కేసు సరైంది కాదని పార్టీ మండల అధ్యక్షుడు సోలం సతీష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

మణుగూరుటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా బీజేపీ నాయకులు బుధవారం రామానుజవరంలోని ప్రధాన రహదారిలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు జంపన సీతారామరాజు మాట్లాడారు. నాయకులు తెలగాని రవి, వెంకటేశ్వర్లు, రమేష్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర


మణుగూరురూరల్: బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక: ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర రాష్ట్రంలో జరుగుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలో ప్రథమ ముద్దాయిగా బండి సంజయ్ ఉన్నట్లు తేలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి బీజేపీ పేపర్ లీకులకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, రైతు సమితి అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: రాష్ట్రంలో పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారంలో బీజేపీ కుట్ర కోణం ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్‌ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, తూము చినరాఘవులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పరీక్ష పేపర్ల లీకేజీలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ కుట్రలకు పాల్పడుతోందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పొడియం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: పదో తరగతి ప్రశ్నాపత్రాలను లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్న తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాష్ట్ర బహిష్కరణ చేయాలని మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం బండారు చందర్‌రావు భవనంలో జరిగిన మహిళా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు జ్యోతి, జీవనజ్యోతి, సుబ్బలక్ష్మి, అశ్విత, రాధ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు హర్షనాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బోశెట్టి రవిప్రసాద్, అధ్యక్షుడు రుద్ర వెంకట్, నాయకులు గుర్రం సృజన్, చైతన్యవర్మ, వంశీ, రంజిత్, సతీష్, సంపత్, పవన్, కార్తీక్, రఘు తదితరులు పాల్గొన్నారు.